ఆర్టీసీ బస్టాండ్.. అలంకారప్రాయం

- 25 ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- పిచ్చి మొక్కలతో దర్శనం
- వినియోగం ఎన్నటికో అంటున్న ప్రయాణికులు


బంగారుపాళెంలో నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

బంగారుపాళెం: పేరుకే బస్టాండ్..అక్కడికి ఒక్క బస్సూ రాదూ, పోదు. మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు వెక్కిరిస్తున్నాయి. పాలకుల వైఖరిని ప్రశ్నిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణకు ఆమడదూరంలో ఉంది. ఫలితంగా ప్రయాణికులకు ఇకట్లు తప్పడం లేదు. బస్సుల కోసం గంటల తరబడి రోడ్ల పక్కనే పడిగాపులు పడాల్సి వస్తోంది. 1996లో బంగారుపాళెంలో పోలీస్ స్టేషన్ పక్కన ఏపీఎస్ ఆర్టీసీ రూ.20 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో ఈ బస్టాండ్‌ను నిర్మించింది. ప్రయాణికుల సౌకర్యార్థం మంచినీటి కుళాయి, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించారు. బస్టాండ్ నిర్మించినప్పటి నుంచి నేటి వరకు వినియోగంలోకి రాకపోవడం గమనార్హం. బస్టాండ్ ఆవరణం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది.

రోడ్లపైనే పడిగాపులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని డిపోల ఆర్టీసీ బస్సులు బంగారుపాళెం మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. చెన్నై–బెంగళూరు నగరాల్లో ప్రైవేటు కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు మండలం నుంచి పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. పలమనేరు, చిత్తూరు పట్టణాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు ప్రతి రోజూ ప్రయాణాలు చేస్తుంటారు. ప్రయాణికులు ఎండైనా, వానైనా రోడ్లపైనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఇక వర్షం వస్తే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. విద్యార్థులు, ప్రజలు బస్సుల కోసం ఎక్కడ నిలబడాలో తెలియని పరిస్థితి. ఒక్కసారిగా విద్యార్థులు బస్సుల కోసం రోడ్లపై ఉరుకులు, పరుగులు తీయడంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి

రూ లక్షలు ఖర్చు వెచ్చించి బస్టాండ్ నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే రోడ్లపైనే పడిగాపులు పడుతున్నారు. బస్టాండ్ నిర్వహణకు నోచుకోక కంపుకొడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

–రామయ్య, ప్రయాణికుడు, చిత్తూరు

నిరీక్షణ తప్పడం లేదు

బస్టాండ్ వినియోగంలేక పోవడంతో బస్సుల కోసం జాతీయ రహదారి పక్కన దుకాణాల ముందు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. ఎండకు, వానకు తడుస్తూ ఎదురు చూస్తున్నాం. రాత్రి సమయంలో మరీ ఇబ్బందులు పడుతున్నాం. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం రహదారి పక్కన కనీసం కూర్చునేందుకు తగిన ఏర్పాటు చేయలేదు.

– గంగాభవాని, ప్రయాణికురాలు, కుప్పం

రాత్రుల్లో అవస్థలు

రాత్రి ఎనిమిది దాటితే బంగారుపాళెం రావాలంటే ప్రయాణికులు అవస్థలు పడాల్సిందే. ఆర్డినరీ బస్సులు ఉండవు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు బంగారుపాళెంలోకి పోవు. బైపాస్ మీదుగా వెళ్లిపోతున్నాయి. దాంతో బంగారుపాళెం పరిసర గ్రామాలకు వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని అంటున్నారు. రాత్రి సమయంలో చిత్తూరు, పలమనేరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ సర్వీసులు బంగారుపాళెం మీదుగా నడపాలంటూ పలుమార్లు ప్రజాప్రతినిధుల ద్వారా ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదని మండల ప్రజలు వాపోతున్నారు. మండల సర్వసభ సమావేశాల్లో సైతం ఆర్టీసీ బస్ సర్వీసులను రాత్రి సమయాల్లో బంగారుపాళెం మీదుగా నడపాలని ప్రస్తావించినప్పటికీ ఆచరణకు రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అన్నదానం ట్రస్టుకు విరాళం


విరాళం అందిస్తున్న దాత

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్య అన్నదానం ట్రస్టుకు ఓదాత సోమవారం నగదు విరాళం చేశారు. బెంగళూరుకు చెందిన దాత విష్ణుష్ చరిత రెడ్డి రూ.2,00,202 నగదును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి స్వామి దర్శనం కల్పించి ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు.

ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్‌గా రామచంద్ర



గుడిపాల: మండలానికి స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా రామచంద్ర నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న జయరామ్ పూతలపట్టు స్పెషల్‌బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా బదిలీ అయ్యారు. యాదమరి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న రామచంద్ర గుడిపాలకు వచ్చారు.

వైద్యులకు సిబ్బంది సంఘీభావం


మద్దతు తెలుపుతున్న వైద్య సిబ్బంది

గుడిపాల: సర్వీసులో ఉన్న వైద్యులకు పీజీ ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గించి వారికి అన్యాయం చేసినందున మండలంలోని బొమ్మసముద్రం పీహెచ్‌సీ వారికి మద్దతుగా సంఘీభావం తెలిపారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యులకు మద్దతు పలికారు.

వినతుల పరిష్కారానికి ప్రాధాన్యత


ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) ద్వారా ప్రజలు అందించే వినతులను వేగంగా పరిష్కరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజినీరు గోమతి, మేనేజరు గోపాలకృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాంపల్లెలో మంచి ప్రభుత్వం

ఐరాల: మండలంలోని నాంపల్లె పంచాయతీలో మంగళవారం ఉదయం ×ఇది మంచి ప్రభుత్వం॰ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొంటారని వివరించారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

దారిని కప్పేసిన కంపచెట్లు


చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో రోడ్డుపైకి వచ్చిన ముళ్లపొదలు

గుడిపాల: చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిని కంపచెట్లు కప్పేయడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఎంసీఆర్ క్రాస్ నుంచి బొమ్మసముద్రం వరకు వెళ్లే రోడ్డులో ఏపుగా పొదలు పెరిగి రహదారిని కప్పేశాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు బొమ్మసముద్రం రోడ్డు నుంచి బొమ్మసముద్రానికి వెళ్లే రోడ్డు కూడా కంపచెట్లతో నిండిపోయింది. వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల రోడ్డు మలుపుల సూచిక బోర్డులను కూడా ముళ్లపొదలు కప్పివేశాయి. అధికారులు స్పందించి కంపచెట్ల తొలగింపు చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.


బొమ్మసముద్రం మలుపువద్ద ..

నేడు తాళంబేడులో పొలం పిలుస్తోంది..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని తాళంబేడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్ తెలిపారు. తాళంబేడు సచివాలయం వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

యాదమరి(పూతలపట్టు): జిల్లా పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, స్వామికణ్ణన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని మాధవరం, కోడిగుట్ట 70 కొత్తపల్లి, పుల్లయ్యగారిపల్లి, వరిగపల్లి , యాదమరి, కొటాల గ్రామాల్లోని పాఠశాలలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు కనకాచారి, శంకర్, శివప్రసాద్, సురేష్‌రెడ్డి, ఆనంద్ పిళ్లై పాల్గొన్నారు.

నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి


సెమినార్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సీతమ్స్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి అన్నారు. మురకంబట్టు వద్ద ఉన్న సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అటల్ ఎఫ్‌డీపీ సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అతిథిగా భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీను పాల్గొన్నారు. ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ అకడమిక్ ఎక్సలెన్స్ నిర్మాణంలో నాయకత్వ లక్షణాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అతిథిగా విచ్చేసిన శ్రీను మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో నాయకత్వ లక్షణాలు, వ్యూహాత్మక ఆలోచన విద్యార్థులకు ముఖ్యమన్నారు. కేంద్రీకృతం, అభ్యాస ప్రక్రియపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఈ సెమినార్‌లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మురళీకృష్ణ, కళాశాల అకడమిక్ అడ్వైజర్ కేఎల్ నారాయణ, డీన్ అకడమిక్స్ శరవణన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి



అరగొండ బాలికల హైస్కూల్లో క్రీడా సామగ్రిని అందజేస్తున్న పూర్వ విద్యార్థి బాబు, మొక్కలు నాటుతున్న బాబు

తవణంపల్లె: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని అరగొండ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలోని సోమవారం విద్యార్థులకు పూర్వ విద్యార్థి, దాత బాబు హాకీ క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడా పరికరాలను పూర్వ విద్యార్థి అందజేయడం అభినందనీయమని తెలిపారు. పూర్వ విద్యార్థి బాబు విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తూ జాతీయస్థాయి క్రీడల్లో రాణిస్తూ పతకాలను సాధించడం హర్షణీయమని అన్నారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థి మాట్లాడుతూ అరగొండ హైస్కూల్‌లో చదువుకున్న విద్యార్థులు పలు రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం!


ఖాదర్ వల్లిని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

పూతలపట్టు: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని పూతలపట్టు కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్ వల్లికి నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్ భరోసానిచ్చారు. టీడీపీకి చెందిన యువకుల దాడిలో గాయపడిన మైనారిటీ కో–ఆప్షన్ మెంబర్‌ను సోమవారం సమన్వయకర్త సునీల్‌కుమార్ కలిసి పరామర్శించారు. తన సొంత పొలానికి వేసిన కంచెను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఖాదర్‌కు, వారి కుటుంబానికి పార్టీ, నియోజకవర్గ నాయకులు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కరపత్రాల పంపిణీ


కరపత్రాన్ని మహిళకు ఇస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నాయుడు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని 5వ డివిజన్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో చేసిన పనులను ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. అన్నా క్యాంటీన్, పెంచిన పింఛన్లు ఇప్పటికే అమలయ్యాయని.. త్వరలోనే తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. పాకాలలో రైల్వే కోచ్, చిత్తూరులో మ్యాంగో బోర్డు పనులు పురోగతిలో ఉన్నాయని, త్వరలోనే దీనిపై స్పష్టత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, టీడీపీ నేతలు దొరబాబు, రాజేష్‌కుమార్‌రెడ్డి, హేమలత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: స్థానిక ఐటీఐ కాలేజీలో ఖాళీ సీట్ల భర్తీకి నాలుగవ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.నగేష్ తెలిపారు. ఈ నెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని 27లోపు వచ్చి సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలన్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసిన అభ్యర్థులు 28న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని చెప్పారు.

వారిపై చర్యలు వద్దు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ శాఖ తనిఖీల్లో భాగంగా నమోదు చేసిన కేసులో పది మందిపై శాఖాపరమైన చర్యల్ని నిలిపేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. 2018 నవంబరు 12న చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ తనిఖీలు చేసింది. సబ్ రిజిస్ట్రార్‌తో పాటు 10 మందిపై కేసు నమోదు చేసింది. దీనిపై శాఖాపరమైన విచారణ జరిగింది. వీరిపై నమోదు చేసిన అభియోగాలు నిరూపితం కాకపోవడంతో తదుపరి చర్యల్ని నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

'ఆడపిల్లలను రక్షించాలి'పై వక్తృత్వ పోటీలు



మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఆడపిల్లలను రక్షించాలి' కార్యక్రమంపై విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీలకు అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన బాలికలు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలో మంగళపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న హేమ ప్రథమ స్థానం, బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తనీషా ద్వితీయ స్థానం సాధించారు. వక్తృత్వ పోటీల్లో బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు నిఖిత, సాధ్వీశ్రీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. డ్రాయింగ్ పోటీల్లో బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని యామిని ప్రథమ, పదో తరగతి విద్యార్థిని షఫియా రెండో స్థానం కైవసం చేసుకున్నారు. ఎంఈఓ రమేష్‌బాబు మాట్లాడుతూ, ఆడపిల్లలు సమాజంలేదని అన్నారు. అటువంటి ఆడపిల్లలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, శ్రీకుమారి, రోజారమణి, సుమిత్రమ్మ, లలిత పాల్గొన్నారు.

సాంస్కృతిక సౌరభం









ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హరికథ కాలక్షేపం, కూచిపూడి, భరతనాట్యం, గీతాలాపనలు, పౌరాణిక నాటిక ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. అద్భుత ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు భక్తులు చప్పట్లతో అభినందించారు. అనంతరం అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.

–కాణిపాకం